వరి సాగుకే మొగ్గు
2





2
ప్రజావాణికి 48 ఫిర్యాదులు

AKSHARA TODAY
అక్షర పటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

స్వేచ్ఛా రథాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం అడిషనల్ కలెక్టర్ భుజంగరావు స్వేచ్ఛా రథాన్ని ప్రారంభించారు. వెట్టిచాకిరీపై అవగాహన పెంపొందించడంతో పాటు టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 08069434343 ద్వారా ఫిర్యాదు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వెట్టిచాకిరి నిర్మూలన కోసం రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఇన్‌చార్జి డీసీఎల్‌శ్రావణి, సహాయ కార్మిక అధికారులు నరేందర్ రాజ్, నవీన్, యూంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్ స్పెక్టర్ సురేష్, డీడబ్ల్యూవో సౌందర్య, డీసీపీవో చైతన్య పాల్గొన్నారు.

చండీయాగంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దుర్గా పరమేశ్వరి మాత మందిరంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం చండీయాగం నిర్వహించారు. పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన చండీయాగంలో సీపీ సాయిచైతన్య పాల్గొన్నారు. యాగం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. యాగంలో అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) భుజంగ రావ్, అదనపు కలెక్టర్ (యూటీ) సురేష్, డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ, ఏఆర్ ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.



టీజీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: టీజీపీఎస్సీ పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశంతో సోమవారం వీసీలో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్టు (అనలిస్ట్), అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 24, 26 తేదీలలో పరీక్షలు జరుగనున్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏవీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. 24న అసిస్టెంట్ సైంటిస్టు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 12.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. 26వ తేదీన కూడా అవే సమయాల్లో అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పోస్టులకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 24వ తేదీ నాటి పరీక్షకు 90 మంది అభ్యర్థులు, 26వ తేదీ నాటి పరీక్షకు 190 మంది హాజరు కానున్నారని కలెక్టర్ తెలిపారు. కాపీయింగ్, లీకేజీలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్దిష్ట సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ట్రైనీ కలెక్టర్ సురేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



దసరా ఉత్సవాలకు వేళాయే..

- ఐదేళ్ల తర్వాత కామారెడ్డిలో మళ్లీ లేజర్‌షో ప్రారంభం
- ఇందిరాగాంధీ స్టేడియంలో ముమ్మరంగా ఏర్పాట్లు
- నిజామాబాద్ జిల్లాలోనూ పండగ సందడి
- ప్రజలతో కళకళలాడిన మార్కెట్లు

కరోనా కంటే ముందు కామారెడ్డిలో దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగేవి. కరోనా తర్వాత వేడుకలు అన్నీ ఒక్కసారిగా నిలిచిపోయాయి. దాంతో పట్టణ ప్రజలతో పాటు శివారు గ్రామాల ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ప్రస్తుతం ఐదేళ్ల తర్వాత మళ్లీ దసరా ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తుండటం పట్ల ప్రజలు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– అక్షరటుడే, కామారెడ్డి/ఇందూరు

కామారెడ్డి పట్టణంలో గత 40 ఏళ్లుగా దసరా ఉత్సవ సమితి, షబ్బీర్ అలీ ఫౌండేషన్ సంయుక్తంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. గతంలో రావణ దహనం కూడా నిర్వహించే వారు. కొంతమంది విజ్ఞప్తి మేరకు కేవలం లేజర్ షో, క్రాకర్స్ పేల్చే కార్యక్రమాలు మాత్రమే కొనసాగించారు. ఈ ఉత్సవాల కోసం ఐదేళ్లుగా ప్రజలు, యువత ఎదురు చూస్తున్నారు.

ఇందిరాగాంధీ స్టేడియంలో..

ఇందిరాగాంధీ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈసారి లేటెస్ట్ లేజర్ షోతో పాటు భారీగా క్రాకర్స్ కాల్చే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు షబ్బీర్ అలీ సమీక్షిస్తున్నారు. ప్రజలకు క్రాకర్స్ వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్టేడియంలోకి వచ్చేదారులను చదును చేసి కొత్తగా కంకరతో మరమ్మతులు చేస్తున్నారు. స్టేడియంలో లైటింగ్ వ్యవస్థ ఏర్పాట్ల కోసం పనులు కొనసాగుతున్నాయి. ఐదేళ్ల తర్వాత మళ్లీ దసరా ఉత్సవాలు జరుగుతుండటంతో కామారెడ్డి పట్టణం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది.

40 ఏళ్లుగా..

కామారెడ్డి పట్టణంలో గత నలబై ఏళ్లుగా దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. గతంలో రావణ దహనం కూడా నిర్వహించేవారు. కొంతమంది విజ్ఞప్తి మేరకు కేవలం లేజర్ షో, క్రాకర్స్ పేల్చే కార్యక్రమాలు మాత్రమే కొనసాగించారు. దసరా ఉత్సవాల కోసం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. లేజర్ షో కోసం ప్రత్యేకమైన వేదిక, లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. వేడుకలను తిలకించడానికి వచ్చే వేలాది మంది ప్రజల కోసం సిట్టింగ్, భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లను సమీక్షిస్తున్న షబ్బీర్ అలీ


దసరా ఉత్సవాల ఏర్పాట్లను షబ్బీర్ అలీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు లేకుండా చూసుకుంటున్నారు. స్టేడియంలో జరుగుతున్న పనులను పరిశీలించి, అవసరమైన సూచనలు చేస్తున్నారు. వేడుకలు విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. రేపు దసరా నేపథ్యంలో సోమవారం నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో మార్కెట్లు కళకళలాడాయి. ప్రజలు పూజ సామగ్రి, పూలు, దుస్తులు కొనుగోలు చేశారు.





నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో దసర సంబరాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. నగరంలోని నాగారం వీర బ్రహేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఏడాది షమీచెట్టుకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే వినాయక్‌నగర్ మహాలక్ష్మి నగర్‌లోని ఆలయానికి సైతం ప్రజలు వెళ్తుంటారు. జమ్మి చెట్టు ఆకులను 'బంగారం' పేరుతో ఒకరికొకరు పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. అలాగే నీలకంఠేశ్వరాలయం, శంభుని గుడి తదితర ఆలయాలను భక్తులు దర్శించనున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో దసరా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.



మహిషాసుర మర్దినిగా జగన్మాత దర్శనం..

నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు మహిషాసుర మర్దిని రూపంలో దర్శనమిచ్చారు. మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల నిర్వాహకులు అన్నదానం చేశారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్

వ్యాపారసంస్థలు ఏడు రోజుల్లో రెన్యువల్ చేసుకోవాల్సిందే..

అక్షరటుడే, కామారెడ్డి : జిల్లా పరిధిలోని వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, వాణిజ్య సముదాయాలు, ఇతరసంస్థలు ఏడురోజుల్లో రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సహాయ కార్మిక కమిషనర్ డాక్టర్ ఎం.శశి కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. దుకాణాలు, వ్యాపార సంస్థల యజమానులు కార్మిక శాఖ నుండి రిజిస్ట్రేషన్ లైసెన్స్ పొందాలని, గడువు ముగిసిన దుకాణాలు ఏడు రోజుల్లో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. చట్టప్రకారం వ్యాపారం నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ తమ సంస్థను కార్మిక శాఖ వద్ద నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోనివారు లేదా లైసెన్స్ రెన్యువల్ గడువు ముగిసినవారు వెంటనే అవసరమైన ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన అనంతరం జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. కార్మిక శాఖ నుండి గతంలో పలుమార్లు పత్రికా ప్రకటనలు జారీ చేసినప్పటికీ, వివిధ దుకాణాలు, వ్యాపార సంస్థల నుండి ఎటువంటి స్పందన రాలేదని లేబర్ సహాయ కమిషనర్ అన్నారు. లైసెన్స్ తీసుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గర్గుల్‌లో రావణ దహనానికి ఏర్పాట్లు పూర్తి

అక్షరటుడే, కామారెడ్డి: మండలంలోని గర్గుల్ గ్రామంలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణ దహన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దసరా పండుగను ఘనంగా జరుపుకునేందుకు గ్రామంలో గత కొన్ని రోజులుగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రావణ దహనం జరిగే ప్రాంగణాన్ని చదును చేసి, శుభ్రం చేశారు. రావణుడి విగ్రహ కటౌట్ సిద్ధం చేశారు. రావణ దహన కార్యక్రమానికి తిలకించడానికి వచ్చే భక్తులు, ప్రజల కోసం సిట్టింగ్, లైటింగ్, సౌండ్ సిస్టమ్ ఏర్పాట్లు చేశారు. క్రాకర్స్ పేల్చే కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. దసరా ఉత్సవ కమిటీ ఛైర్మన్ చింతల రవితేజ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్తుల సహకారంతో ప్రతి ఏటా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా అంతే ఘనంగా రావణ దహన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గోవర్ధన్, శంకర్ గౌడ్, నర్సింలు, నరేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేష్ గౌడ్, స్వామి, శ్యామ్, లింబరాజు, హరీష్, విఠల్ పాల్గొన్నారు.

రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా సాయిరెడ్డి నియామకం

అక్షరటుడే,ఆర్మూర్: రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధిగా సాయిరెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నివాసంలో సోమవారం సాయి రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు. సాయిరెడ్డి మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడి స్థాయి నుండి జిల్లా, రాష్ట్రస్థాయి పదవులు కేవలం బీజేపీ పార్టీలో మాత్రమే రావడం జరుగుతుందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ నాగ సురేష్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం చిన్నారెడ్డి, కిసాన్ మోర్చా నందిపేట్ మండల అధ్యక్షుడు సాయికుమార్, యువమోర్చా మండల ప్రెసిడెంట్ మంగలారపు నవీన్, ఎస్సీ మోర్చా నందిపేట్ మండల ప్రెసిడెంట్ గంధం గంగాధర్, ఐలాపూర్ మల్లన్న తదితరులు పాల్గొన్నారు.





గంజాయి రవాణాపై పోలీసుల ఉక్కుపాదం.. ఇద్దరి అరెస్ట్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈమేరకు 1వ టౌన్ పోలీసులు వివరాలు వెల్లడించారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద 18వ తేదీ ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతడిని మల్కాపూర్‌తండాకు చెందిన సలావత్ శ్రీనివాస్‌గా గుర్తించారు. అతడి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా 4.368 కిలోల గంజాయి లభ్యమైంది. విచారణలో ఒడిశాకు చెందిన పరిమల్ హర్దాల్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, నాందేడ్‌కు చెందిన వాహిద్ ఖాన్ పాషాకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. అలాగే గంజాయి వ్యాపారానికి ఆటోనగర్‌కు చెందిన ఇబ్రహీం ఖాన్, గాంధారికి చెందిన నునావత్ మోహన్ ప్రోత్సహించినట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసులో ఇబ్రహీం ఖాన్‌ను సైతం సోమవారం ఈ రోజు అరెస్టు చేశారు. వీరిద్దరిని తదుపరి చర్యల నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
19.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలి



అక్షరటుడే, ఆర్మూర్: రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఆలూరు ఏవో రాంబాబు రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాల తగ్గుదల, విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రణాళిక వేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బోర్లలో భూగర్భ జలాలు వేగంగా తగ్గే అవకాశం ఉందని, దీనివల్ల రాబోయే రోజుల్లో పంటలకు అవసరమైన నీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉండే వరి సాగును తగ్గించి, నీటి లభ్యతకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా రైతులు పంట నష్టాలను నివారించుకోవచ్చన్నారు. రబీ సీజన్‌లో తెల్లజొన్నలు, ఎర్ర జొన్నలు, నువ్వులు, పొద్దుతిరుగుడు, కుసుమ, మొక్కజొన్న, పెసర, మినుములు తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.





దసరా శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

అక్షరటుడే, ఇందూరు: దసరా సంబరాలకు ఉమ్మడి జిల్లా సిద్ధమైంది. ఈ మేరకు ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అధర్మంపై ధర్మం గెలిచిన దానికి ప్రతీకగా విజయదశమి పండుగను జరుపుకుంటామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.









వరి సాగుకే మొగ్గు

సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. నవీపేట్ మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో రైతులు వరి సాగు కోసం పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. అలాగే నారుమడి సిద్ధం చేసి సన్నవడ్లు వేసేందుకు సిద్ధమయ్యారు. ఎల్‌నినో ఎఫెక్ట్‌తో వరి రెండోపంట వేయవద్దని అధికారులు పేర్కొంటున్నారు. వర్షా భావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి రావొచ్చని అధికారులు చెబుతున్నా.. బోరుబావుల కింద రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

– అక్షరటుడే, బోధన్





కోడిచర్లలో జీపీ సిబ్బందికి నూతన వస్త్రాల అందజేత




అక్షరటుడే, మెండోరా: మండలంలోని కోడిచర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి నూతన వస్త్రాలు, పాదరక్షలు పంపిణీ చేశారు. సర్పంచ్ వేల్పూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు సబ్బులు, ఇతర అవసర మైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది అందరికీ రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పించినట్లు సర్పంచ్ తెలిపారు. సిబ్బంది సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పోచంపాడ్ జలవిద్యుత్ కేంద్రంలో ఘనంగా ఆయుధ పూజ



అక్షరటుడే, బాల్కొండ: పోచంపాడ్ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి కేంద్రంలోని వివిధ యంత్రాలు, పరికరాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ గంగారాం షిండే, ఏడీఈలు శ్రీకాంత్, శ్రీనివాస్, ఏఈ నాగేష్, గంగాధర్, ఎఫ్ఎం నాగార్జున, వినోద్ పీఏతో పాటు జెన్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు పెద్దకొడప్‌గల్ విద్యార్థి



అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.కృష్ణ ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాలుర రగ్బీ విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు కామారెడ్డి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఎంబీ హోమ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 14 బాలుర రగ్బీ పోటీల్లో కృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పీడీ సత్యం వెల్లడించారు. ఈనెల 23 నుంచి 28 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆయన తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కమల తెలిపారు. విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

దుర్గామాత మండపం వద్ద అన్నదానం



అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్వామి వివేకానంద యూత్ దుర్గామాత మండపం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మవారు, మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా శ్రీ స్వామి వివేకానంద యూత్ అధ్యక్షుడు సుదం భూమయ్య మాట్లాడుతూ.. ప్రజలందరూ, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో, అష్ట ఐశ్వర్యాలతో బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆలూర్‌లో ఆయుధ పూజ కార్యక్రమం



అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండల కేంద్రంలో సర్పంచ్ ముక్కెర విజయ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జీపీ కార్యాలయంలో పూజలు చేశారు. జీపీ ట్రాక్టర్‌కు సైతం పూజ చేశారు. సర్పంచ్ ముక్కెర విజయ్ మాట్లాడుతూ, దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఆయుధ పూజ మన సంప్రదాయాలు, సంస్కృతికి ప్రతిబింబమని తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ ఆలూర్ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, రాము, భోజన్న, రంజిత్, భాస్కర్, సంజీవ్, ఖరాబర్ సంతు, సిబ్బంది రఫ్, రమేష్ తదితరులు పాలుగొన్నారు.

అనాథ వృద్ధులకు కొత్త దుస్తుల పంపిణీ



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: డిచ్‌పల్లి మండలంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు రెడ్‌క్రాస్ సొసైటీ మాజీ ఛైర్మన్ బుస్సా ఆంజనేయులు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి దసరా సందర్భంగా దుస్తులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణలో గొప్పగా జరుపుకునే దసరా పండుగకు ప్రతీ ఇంట్లో ప్రతిఒక్కరూ కొత్తదుస్తులు కొనుక్కొని ధరించడం ఆనవాయితీ అన్నారు. అందుకే మాకెవ్వరూ లేరనే ఆలోచన అనాథ వృద్ధుల్లో రావొద్దనే ఉద్దేశంతో వారికి దుస్తులు అందజేశామన్నారు. పెద్దలని ఆదరించాలని.. వారిని గౌరవిద్దామని బుస్సా ఆంజనేయులు అన్నారు. యువత ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి వృద్ధులకు అండగా నిలవాలని సూచించారు.

ఒంటికాలిపై నిలబడి ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల నిరసన



అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె ఏడో రోజుకు చేరింది. సోమవారం నిరవధిక సమ్మెలో భాగంగా ఉద్యోగులు ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. అనంతరం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల జేఏసీ నాయకుల ప్రతినిధి బృందం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించింది. గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు అండగా ఉంటుందని, పరిష్కారానికి తాను ప్రత్యేక చొరవ తీసుకుంటానని, దసరా పండుగ తర్వాత సమస్యలు నెరవేరుతాయని హామీ ఇచ్చారు. కామారెడ్డి జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ అడ్వకేట్ జగన్నాథం, వేణుగోపాల్ సమ్మెకు మద్దతు తెలిపారు. తాళ్లపల్లి సుమన్, హరీష్, అశ్విని, రాజశేఖర్, స్వాతి, మనోజ్, రాహుల్, సందీప్, క్రాంతి, నరేందర్, అఖిల్, నిర్మల, హరిత పాల్గొన్నారు.

ప్రజావాణికి 48 ఫిర్యాదులు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 48 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్డీవో సాయన్న, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.